# ఆంధ్రప్రదేశ్- శీతోష్ణస్థితి

ఆంధ్రప్రదేశ్ ఆయన రేఖామండలంలో ఉంది. అందువల్ల ఉష్ణమండల లేదా ఆయనరేఖా మండలం శీతోష్ణస్థితిని కలిగి ఉంటుంది. భారతదేశం మాదిరిగానే ఈ రాష్ట్రం శీతోష్ణస్థితి రుతుపవనాలపై ఆధారపడి ఉంది. కాబట్టి ఆంధ్రప్రదేశ్ శీతోష్టస్టితిని సాధారణంగా ఆయన రేఖామండల రుతుపవన శీతోష్ణస్థితి అంటారు.

**భారత వాతావరణ శాఖ సంవత్సర కాలాన్ని 4 భాగాలుగా విభజించింది. అవి:**

1. శీతాకాలం (జనవరి నుంచి ఫిబ్రవరి)
2. వేసవికాలం (మార్చి నుంచి జూన్ మధ్య వరకు)
3. నైరుతి రుతుపవనకాలం/వర్షాకాలం (జూన్ మధ్య నుంచి సెప్టెంబరు వరకు)
4. ఈశాన్య రుతుపవనకాలం/ తిరోగమన నైరుతి రుతుపవనకాలం (అక్టోబరు నుంచి డిసెంబరు వరకు)

## 1.శీతాకాలం:

డిసెంబరు చివరి నాటికి రాష్ట్రం మొత్తం చల్లబడి జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉంటాయి.

- ఈ రుతువులో పొడి వాతావరణం నెలకొని ఉంటుంది.
- అనంతపురం, చిత్తూరు జిల్లాలు మిగతా జిల్లాల కంటే తక్కువ ఉష్ణోగ్రతతో ఉంటాయి. ఈ జిల్లాలు మైసూరు పీఠభూమిని ఆనుకుని ఉండటమే దీనికి కారణం.
- ఈ కాలంలో అత్యల్ప ఉష్ణోగ్రత విశాఖ జిల్లాలోని లంబసింగిలో -2°C ఉష్ణోగ్రత నమోదు అవుతుంది.
- కోస్తా ప్రాంతం అంతటా రాత్రుల్లో మంచు బాగా కురుస్తుంది.
- ఉష్ణోగ్రత విలోమం (Temperature Inversion) వల్ల కొన్ని రోజులు ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కురుస్తుంది.
- ఈ కాలంలో కోస్తా జిల్లాల కంటే రాయలసీమ జిల్లాల్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ఇవి సముద్రానికి దూరంగా ఉన్నాయి కాబట్టి.
- మార్చి తర్వాత ఎండలు ముదిరి గ్రీష్మతాపం మొదలవుతుంది.

## 2.వేసవికాలం:

**ఆంధ్రప్రదేశ్‌లో వేసవి కాలం.**

- గరిష్ట ఉష్ణోగ్రత 'మే'లో నమోదు అవుతుంది.
- ఈ సమయంలో గుంటూరు జిల్లాలోని రెంటచింతలలో 45°C పైన ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. మైసూరు పీఠభూమికి ఆనుకొని ఉన్న చిత్తూరు, అనంతపురం జిల్లాలు ఇతర ప్రాంతాల కంటే మరింత చల్లగా ఉంటాయి.
- చిత్తూరు జిల్లాలోని హార్సిలీ హిల్స్ వేసవి విడిది కేంద్రం.
- మే నెల రెండు, మూడు వారాల్లో రాష్ట్రమంతటా వడగాలులు వీస్తాయి.
- ఈ రుతువులో సంవహన ప్రక్రియ అధికంగా జరగడం వల్ల క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన సంవహన వర్షపు జల్లులు పడతాయి.వేసవిలో అత్యధిక సగటు 31.5°C, అత్యల్ప సగటు ఉష్ణోగ్రత 18°C ఉంటుంది.
- రాష్ట్ర సరాసరి ఉష్ణోగ్రత 27°C
- వేసవిలో ఆంధ్రప్రాంతంలో రుతుపవనాలు రాకముందు పడే జల్లులను మామిడి జల్లులు లేదా మ్యాంగోషవర్స్ లేదా తొలకరి జల్లులు లేదా ఏరువాక జల్లులు అని పిలుస్తారు.
- విశాఖపట్నం, మచిలీపట్నం, కాకినాడ ప్రాంతాల్లో సముద్రం ప్రభావం వల్ల తక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయి.
- ఆంధ్రప్రదేశ్ సగటు వర్షపాతం 960 మిల్లీ మీటర్లు

## 3.నైరుతి రుతుపవనకాలం/ వర్షాకాలం

- జూన్ మధ్య నుంచి ప్రారంభమై సెప్టెంబరు చివరి వరకు వర్షాకాలం ఉంటుంది.
- నైరుతి రుతుపవనాల వల్ల ఆంధ్రప్రదేశ్ ఉత్తర ప్రాంతంలో 80 సెం.మీ., దక్షిణ ప్రాంతంలో 40 సెం.మీ. వర్షపాతం ఉంటుంది. ప్రాంతాల వారీగా చూస్తే కోస్తా తీరం సగటు 65.1 సెం.మీ., రాయలసీమలో 46.3 సెం.మీ. వర్షపాతం నమోదవుతుంది.
- జూన్ రెండో వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి.
- నైరుతి రుతుపవనాల వల్ల కోస్తా, రాయలసీమ ప్రాంతాల కంటే తెలంగాణలో అధిక వర్షపాతం పడుతుంది.
- నైరుతి రుతుపవననాల కాలంలో వర్షాల ప్రారంభంలో మబ్బులు, వర్షం వల్ల పగటి ఉష్ణోగ్రత కొంత తగ్గుతుంది. కానీ వర్షంలేని రోజుల్లో సూర్యరశ్మి కారణంగా వేడిగాలిలో తేమ అధికంగా ఉండటం వల్ల ఎక్కువగా చెమట పడుతుంది.

## 4.ఈశాన్య రుతుపవన కాలం/ తిరోగమన నైరుతి రుతుపవనకాలం

అక్టోబరు వర్షాకాలానికి, శీతాకాలానికి మధ్య వారధిలా ఉండి సంధిమాసంలా ఉంటుందని చెప్పవచ్చు. అధిక ఉష్ణోగ్రత, అధిక తేమ కారణంగా వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. దీన్ని సాధారణంగా 'అక్టోబరు వేడిమి' (October Heat) అని అంటారు.

- ఈశాన్య రుతుపవనాల వల్ల కూడా కొద్దిపాటి వర్షం పడుతుంది. ఉత్తర ప్రాంతాల కంటే దక్షిణ ప్రాంతాల్లో ఎక్కువ వర్షం కురుస్తుంది.
- అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య వీచే ఈశాన్య రుతుపవనాల వల్ల సాధారణ వర్షపాతం 224 మి.మీ. నమోదు అవుతుంది.
- ఈ కాలంలో బంగాళాఖాతంలో వాయుగుండాలు ఏర్పడి దక్షిణ కోస్తా జిల్లాలకు (నెల్లూరు,ప్రకాశం) ఎక్కువ నష్టం జరుగుతుంది.
- నైరుతి రుతుపవనాల వల్ల అధిక వర్షపాతం పడే జిల్లా పశ్చిమ గోదావరి. ఈశాన్య రుతుపవనాల వల్ల అధిక వర్షపాతం పడే జిల్లా తూర్పు గోదావరి.
- నైరుతి రుతుపవనాల వల్ల అల్ప వర్షపాతం పడే జిల్లాలు నెల్లూరు, అనంతపురం.
- . ఈశాన్య రుతుపవనాల వల్ల అల్ప వర్షపాతం పడే జిల్లాలు కర్నూలు, అనంతపురం.
- **సగటు అధిక వార్షిక వర్షపాతం పశ్చిమ గోదావరిలో, అల్ప వర్షపాతం అనంతపురంలో నమోదు అవుతుంది.**

## మరిన్ని ముఖ్యాంశాలు:

- రాజస్థాన్‌లోని జైసల్మీర్ తర్వాత అతి తక్కువ వర్షపాతం (560 మి.మీ. కంటే) నమోదు

అయ్యే ప్రాంతం అనంతపురం. ఇది భారత్‌లోనే రెండో స్థానంలో ఉంది.

- జులైలో కోస్తా ఆంధ్రా, తెలంగాణలో అధిక వర్షం పడుతుంది.
- సెప్టెంబరులో దక్షిణ తెలంగాణ, ఆగ్నేయ ప్రాంతంలో అధిక వర్షం పడుతుంది. అక్టోబరులో చిత్తూరులో అధిక వర్షపాతం కురుస్తుంది.
- నవంబరులో నెల్లూరు, గుంటూరులో వర్షాలు పడతాయి.

| **రాష్ట్ర సగటు వర్షపాతం** | **896 మి.మీ.** |
|---|---|
| నైరుతి రుతుపవనాల వల్ల | 602 మి.మీ. |
| ఈశాన్య రుతుపవనాలు వల్ల. | 203 మి.మీ |

| | |
|---|---|
| వేసవి కాలం | 73 మి.మీ. |
| శీతాకాలం | 18 మి.మీ. |
| **మొత్తం** | **896 మి.మీ.** |

- ఆంధ్రప్రదేశ్‌లో రెండు రకాల శీతోష్ణస్థితి మండలాలు ఉన్నాయని తెలిపింది కొప్పెన్.

**అవి:**

1. ఆయన రేఖా వర్షపాత ప్రాంతం (Tropical Rainy-A)

2.శుష్క ప్రాంతం (Dry- B)

- శుష్క ప్రాంతం కడప నుంచి ఉత్తరాన నల్గొండ వరకు, పడమర బళ్లారి నుంచి తూర్పున ఉదయగిరి వరకు వ్యాపించి ఉంది.
- మిగిలిన ప్రాంతంమంతా మొదటి రకానికి చెందింది.

**వరదలు**

- కురవాల్సిన సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం కురిస్తే దాన్ని అతివృష్టి అంటారు.
- అతివృష్టి వల్ల వరదలు వస్తాయి.
- వరదలు సంభవించే ప్రాంతం - కొల్లేరు, వంశధార, శారదానది ప్రాంతాలు; కృష్ణా, గోదావరి ప్రాంతాలు.
- 'ఆంధ్ర దుఃఖదాయిని' బుడమేరు. ("The Sorrow of Andhra")

**కరవు కాటకాలు**

- అనావృష్టి మూలంగా కరవులు వస్తాయి.
- సాధారణ వర్షపాతంలో 75% కంటే తక్కువ వర్షం కురిస్తే దాన్ని కరవు అంటారు.
- సాధారణ వర్షపాతంలో 50% కంటే తక్కువ వర్షం కురిస్తే దాన్ని తీవ్రమైన కరవుఅంటారు.
- అధిక కరవులు సంభవించే ప్రాంతం రాయలసీమ